క్లుప్తంగా

గోమాతకు ప్రత్యేక పూజలు



బాపట్ల: సూర్యలంక సముద్ర తీరంలో నెలకొల్పిన శ్రీతారకేశ్వరస్వామి ఆలయంలో గోమాత పూజలు మంగళవారం నిర్వహించారు. గోలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ అవధాని ఆధ్వర్యంలో మంగళవాద్య గోష, ఆలయ సహిత యాగశాల ప్రదక్షిణం, గణపతి పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, రిత్విక్ వరణం, పంచగవ్యప్రాసనం, వాస్తు పూజ, వాస్తు హోమం, ఆలయ శుద్ధి, యాగశాల శుద్ధి నిర్వహించారు. సాయంత్రం యాగశాల ద్వారా దేవత ఆహ్వానాలు, మత్స్య గ్రహణం, అఖండ దీపారాధన, యోగిని, క్షేత్రపాల, నవగ్రహ, సర్వతోభద్ర మండల దేవతారాధనలు, అగ్ని ప్రతిష్ట, క్షీర, జలాది వాసములు, నీరాజనం మంత్రపుష్పం చేపట్టారు.

పార్వతి ఆలయ హుండీ ఆదాయం రూ.2.73 లక్షలు



కొల్లూరు : పార్వతీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ మంగళవారం జరిగింది. కొల్లూరులోని శ్రీ అనంతభోగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి ఆలయంలో 18 నెలల అనంతరం హుండీ ఆదాయం లెక్కింపు జరిపినట్లు ఆలయ కార్య నిర్వాహక మండలి సభ్యులు పేర్కొన్నారు. భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన నగదు రూ.2,73,561 లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను దేవదాయ శాఖ రేపల్లె శాఖ ఇన్‌స్పెక్టర్ చరణ్ కుమార్ పర్యవేక్షించారు.

బైబిల్ తరగతులు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రైస్తవ బాలబాలికలకు చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్(సీబీసీ) తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల్లో భాగంగా మంగళవారం వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించారు. గురు మండల అధ్యక్షులు, పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. తరగతులు ఐదు రోజులపాటు జరుగుతాయని, ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టరమ్మ దాసరి విజయ, సండే స్కూల్ టీచర్స్, సీబీసీ టీచర్స్ పాల్గొన్నారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ సండే స్కూల్ చిల్డ్రన్స్, సంఘం సహకారంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు.

విద్యుత్ లైన్ ప్రారంభం



బాపట్ల అర్బన్: ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ నందిరాజుతోటలోని పీటా రాములు నగర్‌లో విద్యుత్ సౌకర్యం లేని రహదారులన్నింటికీ 24 నూతన స్తంభాలతో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను మంగళవారం గ్రామ పెద్దలు పీటా వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి దృష్టికి విద్యుత్ సమస్యను తీసుకెళ్లడంతో త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే కోన రఘుపతికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.6.35 లక్షలు విద్యుత్ పనులకు కేటాయించినట్లు పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తెలిపారు. రెండు వారాల్లో పనులు పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది మోహన్ రెడ్డి, మొహమ్మద్, స్థానిక నాయకులు పీటా భాస్కరరావు, సముద్రం శ్రీనివాస్, హనుమంతరావు, రవికుమార్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

రేపల్లె: పట్టణంలోని కోర్టు హాలులో ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగ్గ కేసులకు సంబంధించిన కక్షిదారులు తమ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

మంత్రి మేరుగ నాగార్జున



అగ్ని ప్రమాద బాధితురాలు సౌదామణికి నగదు అందజేస్తున్న మంత్రి నాగార్జున

అద్దేపల్లి(భట్టిప్రోలు): అగ్నిప్రమాద బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధంకావడమే కాకుండా ఇంట్లో నిద్రిస్తున్న ఓ యువకుడు సగభాగం కాలిపోయి గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం బాధితులు అమర్తలూరి సౌదామణిని మంత్రి నాగార్జున పరామర్శించి ఓదార్చారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సౌదామణి కుమారుడు రవి కుమార్(చంటి)కి మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. స్వయం సహాయక సంఘంలో ఉన్న సౌదామణి బ్యాంకు నుంచి తెచ్చుకున్న మొత్తం రూ.2.50 లక్షలు కూడా మంటల్లో బుగ్గిపాలు కావడంతో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణతో మాట్లాడి పరిస్థితిని బ్యాంకు అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం తరపున అందే సహాయం కూడా త్వరగా వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరపున 22 వేలు నగదు, నిత్యవసర సరుకులు అందించారు. గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్ నిత్యవసర సరుకులు, బియ్యం మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, నన్నెపాముల చంటి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు గోవర్ధనగిరి చినబుజ్జి, కుందేటి రమేష్, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, తలకొల యలమంద, మద్దుల గిరిధర్, వేల్పూరి నాగేశ్వర రావు, మోర్ల కోటేశ్వరరావు, దారా చెన్నయ్య, దాసరి ఉదయశేఖర్, గుజ్జర్లమూడి నరేష్, కసుకుర్తి శ్రీను, చేబ్రోలు నాగార్జున, కంభం ఫకీరు, పెరికల శ్యామ్, షేక్ అబ్దుల్ కరీమ్, కుక్కల వెంకట్రామయ్య, దాసరి కోటేశ్వరరావు, కొలుసు శ్రీనివాసరావు, దాసరి ఫణీంద్ర, కొతరపు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పది ప్రతిభావంతులకు అభినందన



పెసర్లంక హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థిని, తండ్రిని అభినందిస్తున్న దృశ్యం



వెల్లటూరు హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

పెసర్లంక(భట్టిప్రోలు): పదో తరగతి పరీక్షల్లో పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం అభినందన సభ నిర్వహించారు. మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన పట్టపు అఖిలతోపాటు అధిక మార్కులు సాధించిన తిరుమలశెట్టి భార్గవి, కార్తికేయ, మల్లిపెద్ది రిషితలను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మహబూబ్ బాషా, గ్రామ సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా హైస్కూల్‌లో నిర్మిస్తున్న రెండు అదనపు తరగతి గదులకు భూమి పూజ నిర్వహించారు.

వెల్లటూరులో..

మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 77 శాతం ఉత్తీర్ణత సాధించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన షేక్ ప్రభు తేజ్ వలి, లుక్కా సాయి, అంబటి ఆదినా బ్లెస్సీ, సంజయ్ ఆదిత్యలను, వారి తల్లిదండ్రులను మంగళవారం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోటూరు వాసుదేవరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ చెన్ను సాంబశివరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని అభినందించారు. విద్యార్థులకు స్వీట్లు తినిపించారు.

సస్య రక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



కర్లపాలెంలో వేరుశనగ పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కర్లపాలెం: వేరుశనగ సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం అధికారి విజయనిర్మల తెలిపారు. మంగళవారం కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజుపాలెంలోని వేరుశనగ పైర్లను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. విజయనిర్మల మాట్లాడుతూ వేరుశనగ పైరులో తెగుళ్లను గుర్తించి సరైన మోతాదులో మందులు పిచికారీ చేయటం వల్ల తెగుళ్లను అరికట్టుకోవచ్చునన్నారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు తెగులు అధికంగా కనిపిస్తున్నాయని, వీటి నివారణకు మ్యాంకోజబ్ 500 గ్రాములు నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలని చెప్పారు. రోజెట్టి వైరస్ సోకిన మొక్కలను పీకి వేయాలని సూచించారు. ఏరువాక శాస్త్రవేత్త సురేఖాదేవి మాట్లాడుతూ ఇనుపధాతు లోపం నివారణకు 1000గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ 200 గ్రాముల నిమ్మ ఉప్పును 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ భాగ్యలక్ష్మి వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం నిత్యహోమం, ఆలయ బలిహరణ, నవ కుంభారాధన నిర్వహించారు. భక్తులు, దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శన పోటీలు జరిగాయి. జూనియర్స్ విభాగంలో కంతేటి గగనశ్రీ ప్రథమ బహుమతిని గెలుచుకోగా, లక్ష్మీప్రణతి ద్వితీయ బహుమతిని, సుజిత్ తృతీయ బహుమతిని గెలిచారు. సీనియర్స్ విభాగంలో సీహెచ్ వైష్ణవి, జి.సాతిృక, యు.హారికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. దేవస్థాన ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు విజేతలకు బహుమతులను అందజేశారు.

సమస్యల పరిష్కారం కోసం 'జగనన్నకు చెబుదాం'



భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు/కర్లపాలెం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఫ్లెక్సీని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఏర్పాటు చేశారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ విధానాల్లో ఫిర్యాదులు స్వీకరించి ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రీవెన్స్ కోసం మండలస్థాయి వరకు మూడు స్థాయిల్లో బృందాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజలు హెల్ప్‌లైన్ 1902కు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమంను ప్రవేశపెట్టిందని కర్లపాలెం ఎంపీడీవో రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి మంగళవారం సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులు, ప్రజా ప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, నాయకులు గొర్ల సుబ్బారావు, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

తెనాలి: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్య డ్రగ్స్ అని, నేటి యువతరం వీటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని టూటౌన్ సీఐ వెంకట్రావు చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ స్టెప్, గుంటూరు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. సీఐ వెంకట్రావు మాట్లాడుతూ తెనాలి, పరిసర ప్రాంతాల్లో గంజాయి విరివిగా లభిస్తోందని, దీనిని అరికట్టేందుకు పోలీసుశాఖ ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. గంజాయి విక్రయ మూలాలను ఛేదించేందుకు పోలీసులు చేస్తున్న కృషికి సమాజం తోడుగా నిలవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతతో ఆయా కుటుంబాలు మాత్రమే కాకుండా పరిసరాల్లోనివారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉండటంతోనే మనం నియంత్రణ చేయొచ్చని వివరించారు. 'స్టెప్' సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇందుకోసమే డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ అవగాహన సదస్సులను చేపడుతున్నట్లు వివరించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



మంగళగిరి: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి మంగళగిరికి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మార్గంమధ్యలోని యర్రబాలెం పొగాకు కంపెనీ వద్ద మంగళవారం సెబ్ సీఐ మారయ్యబాబు ఆదేశాల మేరకు సెబ్ ఎస్ఐ మల్లికార్జునరావు నేతృత్వంలో సిబ్బంది గోవింద్, హనుమంతు తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్‌తో మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించగా రూరల్ ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో మొక్కజొన్న చేలు దగ్ధమయ్యాయి. తెనాలి మండలం అంగలకుదురులోని పిడపర్తి ప్రదీప్‌కుమార్, కూచిపూడి లక్ష్మయ్య, నలుకుర్తి నాగరాజులకు చెందిన సుమారు మూడెకరాల్లోని మొక్కజొన్న పంట మంగళవారం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న తెనాలి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. సుమారు రూ.2.5 లక్షల ఆస్తినష్టం సంభవించి ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

మద్యం మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దు



మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపేవారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి జీవితాలు నాశనం చేసుకోవద్దని తాడేపల్లి సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ద్విచక్రవాహనాలను, ఇతర వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడపడం వల్ల మీ ప్రాణాలతోపాటు, ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని అన్నారు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయిన ఎంతో మంది కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం

పిట్టలవానిపాలెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ షేక్ బాజి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో పనులు పూర్తిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు తక్షణమే విడుదలవుతున్నాయని, అపోహలను నమ్మవద్దని సూచించారు. బిల్లులు త్వరగా అవుతున్నాయని తెలిపారు. పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, ఎంపీడీఓ కె.పద్మజ, సీడీపీఓ శైలజ, తహసీల్దార్ డి.కవిత పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



రేపల్లె రూరల్: మద్యం తాగి వాహనాలు నడపరాదని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓల్డ్‌టౌన్, ఇసుకపల్లి సెంటర్లలో వాహనాల తనిఖీలు నిర్వహించి వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రయాణ సమయంలో వాహనానికి సంబంధించిన కాగితాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఆయన వెంట ఏఎస్ఐ మస్తాన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ మరమ్మతులు పూర్తి



పెనుమర్రు(వేమూరు) మండలంలోని పెనుమర్రు గ్రామంలో వాటర్ ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేసినట్టు గ్రామ సర్పంచ్ కొక్కిలగడ్డ సుమతి తెలిపారు. సుజల పథకం టీడీఎస్ శాతం పెరగడంతో ప్లాంట్ మూత పడింది. వెంటనే స్పందించి పంచాయతీ నిధులు రూ.2 లక్షలు కేటాయించి కొత్త సామగ్రితో ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేశామని ఆమె తెలిపారు. బుధవారం నుంచి గ్రామంలో వాటర్‌ప్లాంట్ ద్వారా తాగునీరు అందిస్తామని వివరించారు.

తొమ్మిది కిలోల కణితి తొలగింపు

తెనాలిరూరల్: మహిళ అండాశయంలో ఉన్న తొమ్మిది కిలోల కణతిని వైద్యులు తొలగించారు. 31 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపు నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో పట్టణ కొత్తపేటలోని దేవి నర్సింగ్ హోం(రవీందర్ బాబు హాస్పటల్)కు వచ్చింది. పరీక్షలు చేయించిన వైద్యులు మహిళ అండాశయంలో కణతి ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం శస్త్రచికిత్స చేసి తొమ్మిది కిలోల కణతిని తొలగించారు. డాక్టర్ ఈదుపుగంటి మౌనిక, డాక్టర్ ముత్తవరపు రామలింగేశ్వర రావు, అనస్థిటిస్ట్ డాక్టర్ ప్రసాద్ శస్త్ర చికిత్స చేశారని నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ కొత్త రవికిరణ్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



అభయాంజనేయస్వామి వారు

గాజులపేట(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొత్తగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కుండములలో నిత్య హోమం, సప్తకలశ స్నపన, క్షీరాధివాసం, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం యంత్రార్చన, కుండములలో నిత్య హోమం, నవగ్రహ ఆరాధన, నవగ్రహ హోమం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అభయాంజనేయస్వామికి గ్రామోత్సవం చేశారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

యానిమేటర్లు పారదర్శకంగా పనిచేయాలి

భట్టిప్రోలు : స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలలో నిర్వహించే ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు లేకుండా, సభ్యుల మధ్య ఎలాంటి వివాదాలు లేకుండా ఉండేలా యానిమేటర్లు పారదర్శకంగా పనిచేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అన్నారు. అలాగే హౌసింగ్ రుణాలు లబ్ధిదారులకు ఇప్పించి గృహాలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, సీసీలు రజని, హనోకు, సాంబయ్య, స్త్రీ నిధి మేనేజర్ అశోక్, అకౌంటెంట్ శిరీష, కార్యనిర్వాహక సభ్యులు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఇంటర్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎంఆర్ఆర్ అండ్ ఎవీఎస్ జూనియర్ కళాశాలలో 2022-2023 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ భూపతి రమేష్‌బాబు, కరస్పాండెంట్ మాటూరి తాండవ కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో సీఈసీ తెలుగు మీడియంలో కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.